
సాక్షి
సిద్దిపేట
సోమవారం । 25 । నవంబర్ । 2024



కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ
విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు కరాటే ఎంతో ఉపయోగపడనుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.
వివరాలు 8లో ▸



ప్రాథమిక విద్యను కాపాడాలి
ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తోందని 'తపస్' రాష్ట్ర కార్యదర్శి నవాత్ సురేశ్ అన్నారు.
వివరాలు 8లో ▸



సర్వే వివరాల నమోదు..
సమగ్ర సర్వే చివరి దశకు చేరుకుంది. ఎన్యుమరేటర్లు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు హుస్నాబాద్‌లో సాంస్కృతిక కళా ప్రదర్శన

సిద్దిపేటరూరల్: ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో సాంస్కృతిక కళాప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మనుచౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నారని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కళా ప్రదర్శన కోసం ప్రత్యేక వేదికను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

క్రమశిక్షణతో భవిష్యత్తుకు బాటలు
అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

మిరుదొడ్డి(దుబ్బాక): క్రమశిక్షణతో భవిష్యత్తుకు బాటలు పడతాయని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ విద్యార్థులకు సూచించారు. మిరుదొడ్డిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. రికార్డులను, విద్యార్థుల హాజరు, టీచర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు వడ్డిస్తున్న మెనూ తీరును, కిచెన్‌లోని నిత్యావసర సరుకులను, కూరగాయలను పరిశీలించారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గుణాత్మకమైన, నాణ్యమైన విద్యను బోధించి వార్షిక పరీక్షల్లో మంచి సత్ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికిషన్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత, టీచర్లు ఉన్నారు.

నేతాజీ జీవితం స్ఫూర్తిదాయకం
ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, చిత్రంలో వంటేరు

గజ్వేల్: నేతాజీ సుభాస్ చంద్రబోస్ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పేరుకుపోయిన రుగ్మతల నివారణకు నేటి యువత సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ ప్రముఖులు మిన్నకంటి ప్రసాద్, ఉప్పల మెట్టయ్య, మతిన్, డాక్టర్ నరేష్‌బాబు, ఎల్లు రాంరెడ్డి, మనోహర్, ఉప్పల మధు, నిర్వాహకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే కేసులు పెట్టాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

హుస్నాబాద్: రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు పెట్టాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భారత రాజ్యాంగ పరి రక్షణ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ ఈ నెల 26న భారత రాజ్యాంగం దినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంబేడ్కర్ విగ్రహాల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన పేరిట విజ్ఞాన కేంద్రాలను నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సదానందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేరాలు, రాష్ట్ర కార్యదర్శులు ఎల్లయ్య, కండె సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాక రమేశ్ తదితరులు ఉన్నారు.

విలీన గ్రామాల్లో యూజీడీ లేనట్లే!



గజ్వేల్ పట్టణం పిడిచెడ్ చౌరస్తాలోని ఓ ఇంటికి యూజీడీ కనెక్షన్ ఇవ్వకపోవడంతో పైపులను బయటకు వదిలేసిన దుస్థితి

రూ.49కోట్ల ప్రతిపాదనలకు మంగళం

- గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లోనూ అసంపూర్తిగా పనులు
- మొదటి దశలో రూ.155 కోట్లతో భూగర్భ మురుగు పైప్‌లైన్
- ఈ పనులకు సైతం నిధుల కటకట
- అస్తవ్యస్తంగా యూజీడీ నిర్వహణ

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాల్లో రెండోవిడతగా చేపట్టాల్సిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనుల ప్రతిపాదనలకు మంగళం పాడారు. రూ.49కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినా ఫలితం లేకుండా పోయింది. మొదటి దశలో రూ.156కోట్లతో చేపట్టిన పనులకు సైతం నిధుల కటకట వెంటాడుతోంది. ఫలితంగా పట్టణంలో యూజీడీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

గజ్వేల్: మున్సిపాలిటీలో విలీనమైన ముట్రాజ్‌పల్లి, క్యాసారంతోపాటు మధిర గ్రామాలైన సంగాపూర్, రాజిరెడ్డిపల్లి, సంగుపల్లిలో రెండో విడతలో యూజీడీ పనులు చేపట్టడానికి నిర్ణయించారు. సుమారు 40 కిలోమీటర్లకుపైగా ఆయా గ్రామాల్లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అవసరమని గుర్తించారు. ఇందుకోసం రూ.49కోట్లతో ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. కానీ ఈ ప్రతిపాదనలకు దాదాపుగా మంగళం పాడారు. దీంతో విలీన గ్రామాల్లో యూజీడీ నిర్మాణం కలగానే మిగిలింది. మొదటి విడతలో పనులు చేపట్టి రెండోవిడతకు నిధులు ఇవ్వకపోవడంపై విలీన గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము మున్సిపాలిటీలో అంతర్భాగం కాదా..? అని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

మొదటి విడత పనులకూ..

మున్సిపాలిటీ పరిధిలోని గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలో 2020 జూన్ నెలలో 138 కిలోమీటర్ల మేర భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ వ్యవస్థతో పాటు నాలుగు చోట్ల ఎస్‌టీపీ (సేవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ల నిర్మాణం చేపట్టారు. మొదట్లో విడుదలైన రూ.99కోట్లతో పనులతో పూర్తి కాక అంచనాలు అమాంతంగా పెంచారు. నిజానికి ముందున్న ప్రతిపాదనల్లో 138 కిలోమీటర్ల పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. కేవలం 99కిలోమీటర్ల పైప్‌లైన్ విస్తరణకే నిధులు సరిపోయాయని, పట్టణంలో ఇంకా పనులు చేపట్టాల్సిన కాలనీలు ఉన్నాయని, వీటిల్లో అంతర్గత పైప్‌లైన్లను నిర్మించాల్సి ఉన్నదని చెబుతూ అంచనా వ్యయం పెంచారు. అదనంగా రూ.56కోట్ల నిధులు తెప్పించారు. పెంచిన నిధులతో అంచనా వ్యయంతో రూ.155 కోట్లకు చేరింది. ఈ నిధులతో 99కిలోమీటర్ల నుంచి 130కిలోమీటర్లకుపైగా పైప్‌లైన్ పనులు పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. అయినా.. పట్టణంలో ఇంకా పట్టణంలోని పలు కాలనీల్లో పనులు వందశాతం పూర్తి కాలేదు.

జెట్టింగ్ యంత్రాల జాడేది?

బిల్లుల చెల్లింపులు పూర్తిస్థాయిలో జరగడం లేదనే కారణంతో సదరు కాంట్రాక్టర్ పనులు వందశాతం పూర్తిచేయడానికి వెనకంజ వేయడంతో పట్టణంలో యూజీడీ నిర్వహణ అస్తవ్యస్తంగా తయాయ్యింది. ఎక్కడైనా యూజీడీ చాంబర్లు నిండితే.. వాటిని క్లియర్ చేయాల్సిన జెట్టింగ్ యంత్రాలు అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఈ యంత్రాల జాడే లేదు. దీనివల్ల చాంబర్లను సకాలంలో క్లియర్ చేయక దుర్గంధం వెదజల్లుతున్నది. పట్టణ ప్రజల నుంచి నిరసన వ్యక్తమైన సందర్భాల్లో నిజామాబాద్ లేదా సిద్దిపేట మున్సిపాలిటీల నుంచి అధికారులను బతిమాలుకొని జెట్టింగ్ యంత్రాలను తెప్పించుకుంటున్నారు. పైప్‌లైన్లు క్లియర్ చేశాక తిరిగి పంపిస్తున్నారు. ఇకపోతే వర్షాలు వస్తే కూడా పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు నీరు యూజీడీ చాంబర్ల నుంచి ఉబికి బయటకు వచ్చాయి. దీనివల్ల రహదారులపై దుర్గంధం వెదలజల్లుతున్నది. మరో ముఖ్యమైన అంశమేమిటంటే కొత్త కనెక్షన్‌లు ఇవ్వపోవడం వల్ల ప్రజలే స్వచ్ఛందంగా మెటీరియల్ సమకూర్చుకొని...కనెక్షన్‌లు తీసుకుంటున్నారు. దీనివల్ల ఒక్కొక్కరిపై రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు భారం పడుతున్నది.

వందల సంఖ్యలో పెండింగ్..

పట్టణంలో నిజానికి 9,500 పైచిలుకు ఇళ్లకు యూజీడీ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 8,692 కనెక్షన్లు ఇచ్చామని అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి ఇంకా వందల సంఖ్యలో ఇళ్లకు కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని నెలలుగా కొత్త కనెక్షన్ల కోసం ప్రజలు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. యూజీడీ పనులు చివరి దశలో నిలిచిపోవడానికి బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని సాకుగా చెబుతున్నారు.

బిల్లుల పెండింగ్ వల్లే..



మున్సిపాలిటీ పరిధిలో మొదటి విడతలో చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు ఇంకా రూ.48కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉన్నది. దీనివల్ల పట్టణంలో యూజీడీ నిర్వహణ కొంత ఇబ్బందిగా ఉన్న మాట వాస్తవమే. విలీన గ్రామాల ప్రతిపాదనల ఊసే లేదు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.
– ఎన్‌సీ రాజమౌళి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్



వెచ్చదనం కోసం మంటలు వేసుకున్న ప్రజలు

చలి మంటలు



మిరుదొడ్డిలో కమ్ముకున్న పొగ మంచు

మిరుదొడ్డి(దుబ్బాక): ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలి తీవ్రత పెరుగుతోంది. చలికి జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు చలిని తట్టుకోలేక గజగజ వణికిపోతున్నారు. ఆదివారం ఉదయం విపరీతంగా పొగమంచు కమ్మేసింది. చలి నుంచి కాపాడుకోవడానికి వృద్ధులు, చిన్నారులు, మహిళలు, యువతీ యువకులు స్వెట్టర్లు, మఫ్లర్లు, మంకీ క్యాపులు ధరిస్తున్నారు. రాత్రి వేళ చలి మంటలు వేసుకుంటూ వెచ్చదనం కోసం పరితపిస్తున్నారు.

ప్రశాంతంగా స్కాలర్‌షిప్ పరీక్ష



సిద్దిపేట పట్టణంలోని పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

97.12శాతం హాజరు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఆది వారం ప్రశాంతంగా కొనసాగింది. జిల్లాలోని 9 పరీక్షల కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 8 గంటల వరకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. జిల్లాలో 1,877 మంది విద్యార్థులకు గాను 1823 మంది హాజరయ్యారు. దీంతో హాజరుశాతం 97.12శాతం నమోదు అయ్యింది. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది.

విద్యార్థుల ఉన్నతికి స్పెల్‌బీ

సాక్షి ఆధ్వర్యంలో నిర్వహణ

సిద్దిపేటజోన్: విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పదును పెట్టేందుకు స్పెల్‌బీ వేదికగా మారుతుంది. సాక్షి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబిటాస్ స్కూల్‌లో స్పెల్‌బీ పరీక్షలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 48 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థులు ఈలాంటి పరీక్షలకు హాజరు కావడం వల్ల వారిలో ఏకాగ్రత, నైపుణ్యాలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ఆనందం నింపేందుకు సాక్షి ఆధ్వర్యంలో చాక్లెట్స్ పంపిణీ చేశారు. పరీక్షలను అంబిటాస్ పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

ప్రతిసారి పాల్గొంటున్నా..

సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించే స్పెల్‌బీ పరీక్షలకు ప్రతిసారి హాజరు అవుతున్నా. గతంలో జిల్లా మొదటి స్థానం సాధించా. ఈసారి మళ్లీ రాస్తున్నా. చాలా ఆనందంగా ఉంది. పోటీ పరీక్షలకు సులువుగా సిద్ధం అయ్యేందుకు స్పెల్‌బీ ఎంతో ఉపయోగపడుతుంది.
–పూనమ్ శర్మ, అంబిటాస్



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మరింత ప్రతిభ

అన్ని విషయాలను తెలుసుకునే అవకాశం స్పెల్‌బీ పరీక్షల ద్వారా కలుగుతుంది. భవిష్యత్తులో ప్రతి సారి పరీక్షలకు హాజరుకావాలని ఉంది. మాలో మరింత ప్రతిభకు చొరవ చూపుతున్న సాక్షికి థాంక్స్.
–రఘువర్ధన్, అంబిటాస్

చాలా ఉపయోగకరం

స్పెల్‌బీ పరీక్షలు రాయడం వల్ల భవిష్యత్తులో పరీక్షలు అంటే ఒక భయం పోతుంది. చాలా చక్కగా, సులువుగా పోటీ పరీక్షలు రాయొచ్చు.. తెలియని విషయాలు కూడా స్పెల్‌బీ ద్వారా తెలుస్తోంది. ఇది మాకు చాలా ఉపయోగకరమైన పరీక్ష.
–అయోష్, వికాస్ స్కూల్ చేర్యాల

66,975 మంది ఓటర్లు

ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ ముసాయిదా జాబితా విడుదల

- డిసెంబర్ 9వరకు అభ్యంతరాల స్వీకరణ
- 30న తుది జాబితా ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో 71 మండలాలు, 102 పోలింగ్ స్టేషన్లు



సంగారెడ్డి జోన్: ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితా విడుదలైంది. త్వరలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఈ నెల 6 వరకు అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు జాబితా కసరత్తు కొనసాగుతోంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, జాబితాను సిద్ధం చేసి విడుదల చేశారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు మరోసారి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలతోపాటు దరఖాస్తులను స్వీకరించనున్నారు. నమోదుకు కల్పించిన అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. డిసెంబరు 25వరకు అభ్యంతరాలను పరిశీలించి, అదే నెల 30న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 71 మండలాలు ఉండగా 102 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. సంగారెడ్డిలో 28 మండలాలకు 40 పోలింగ్ స్టేషన్లు, మెదక్‌లో 21 మండలాలకు 22 పోలింగ్‌స్టేషన్లు, సిద్దిపేటలో 22 మండలాలకు 40 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఆయా జిల్లాలో సెప్టెంబర్ 30 నుంచి ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరించగా 82,448 వచ్చాయి. వాటిని పరిశీలించి అందులోంచి 15,473 మందిని దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. మిగిలి 66,975 మంది ఓటర్లతో కూడిన ముసాయిదా జాబితాను విడుదల చేశారు. కాగా ముసాయిదా ఓటర్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు డిసెంబర్ 9 వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. విడుదలై ముసాయిదా ఓటర్ జాబితా ప్రకారం ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేటలో అత్యధికంగా 29,444 పట్టభద్రులు ఉండగా, ఉపాధ్యాయులలో సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా 2,901గా ఉన్నారు. అదేవిధంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో మహిళలకంటే పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.


జిల్లాల వారీగా పట్టభద్రులు

జిల్లా	స్త్రీలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	6,331	13,670	20,001
మెదక్	3,086	7,945	11,031
సిద్దిపేట	9,826	19,618	29,444

జిల్లాల వారీగా ఉపాధ్యాయులు

జిల్లా	స్త్రీలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	1,075	1,421	2,496
మెదక్	393	709	1,102
సిద్దిపేట	1,062	1,839	2,901

సిద్దిపేట జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు అత్యధికం



మల్లన్న క్షేత్రం.. భక్తజన సంద్రం



పట్నం వేస్తున్న భక్తులు

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గంగిరేణు ప్రాంగణంలో పట్నాలు వేసి ముడుపులు చెల్లించారు. జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.
- కొమురవెల్లి(సిద్దిపేట)



వ్రతాలతో శోభిల్లి.. భక్తులతో కిక్కిరిసి



నాచగిరికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ వ్రతమండపం, క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు క్షేత్రానికి చేరుకుని హరిద్రలో కార్తీక నదీస్నానమాచరించారు. స్వామివారిని దర్శించుకుని తరించారు. దాదాపు 8 వేల మంది భక్తులు నాచగిరీశుని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.
-వర్గల్(గజ్వేల్)

సీసీఐ కొనుగోళ్లు నిరంతరం సాగాలి

గజ్వేల్: సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు నిరంతరంగా సాగేలా చూడాలని, సెలవుల పేరిట తరుచూ నిలిపివేయవద్దని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి మర్కంటి ఏగొండ డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లో బీజేపీ నేతలు వెంకట రమణ, దేవులపల్లి మనోహర్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దళారుల నుంచి రైతులను కాపాడటానికే కేంద్రం సీసీఐ అధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను చేపడుతున్నదని చెప్పారు. స్థానిక అధికారులు ఈ కేంద్రాలు సజావుగా నడిచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి మర్కంటి ఏగొండ

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఖాదిరాబాద్ విద్యార్థి



బహుమతి అందుకుంటున్న విద్యార్థి సాయికుమార్

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఖాదిరాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జీ.సాయికుమార్ జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. 21 నుంచి 23 వరకు జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోని పాఠశాలలో జరుగగా సాయికుమార్ ఔషధ మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రాజెక్ట్ ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో మొదటి బహుమతి లభించడంతోపాటు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు గైడ్ టీచర్ కె.లలిత తెలిపారు. విద్యార్థికి బహుమతితోపాటు ప్రశంసా పత్రాన్ని అధికారులు అందజేశారు. విద్యార్థిని ఎంఈఓ గోవింద్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నెట్ బాల్ పోటీలకు..

తొగుట(దుబ్బాక): రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బీ.అనీష్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నయీమా కౌసర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రజ్ఞాపూర్‌లో అండర్ 17 విభాగంలో ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ పోటీలు నిర్వహించగా పాల్గొని అత్యుత్తమ ప్రతిభకనబర్చాడు. ఇదే నెలలో మహబూబాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీఈటీ కనకయ్యను హెచ్‌ఎం అభినందించారు.

బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రేవంత్, అనిల్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చారు. అండర్ 14 విభాగంలో ఇద్దరు విద్యార్థులు తృతీయ స్థానాన్ని దక్కించుకొని ఉన్నతాధికారుల చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. హెచ్‌ఎం పెద్ది విఠల్‌తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి శిక్షణిచ్చిన పీఈటీ ఉప్పలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

20 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లిన వైనం

హుస్నాబాద్: బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటన ప్రభుత్వాస్పత్రి బైపాస్ రోడ్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జమ్మికుంట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. లారీ ముందు భాగంలోని టైరు బైక్ ఇరుక్కొని 20 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లింది. ద్విచక్ర వాహనదారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి సోదరుడు మృతి

హరీశ్‌రావు సంతాపం

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు కూర రఘోత్తంరెడ్డి సోదరుడు కూర రవీందర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. రవీందర్ రెడ్డి మృతిపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం తెలిపారు. ఉపాధ్యాయుడిగా అందించిన తన సేవలను కొనియాడారు.

కూలీల కొరత.. యంత్రాల బాట



యంత్రం సహాయంతో విత్తుతున్న ఆలుగడ్డ విత్తనం

- ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న ఆలు రైతులు
- రెట్టింపు కూలి లభిస్తుండటంతో పత్తి తీసేందుకు కూలీలు
- తప్పక యంత్రాలతోనే విత్తనాలు
- కొంత మేర తీరిన ఇబ్బందులు
- ముమ్మరంగా సాగుతున్న పనులు

జహీరాబాద్: 'ఆలు' సాగుకు కూలీల కొరత ఏర్పడింది. దీంతో సాగుకు అవసరమైన మేర కూలీలు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఆలు గడ్డ విత్తనం వేసే యంత్రాలు అందుబాటులోకి రావడంతో విధిలేక వాటితో వేస్తున్నారు. కూలీల కొరత వేధిస్తున్న సందర్భంలో యాంత్రిక సదుపాయం అందుబాటులోకి రావడంతో ఆలుగడ్డ పంట సాగుకు వినియోగించుకుంటున్నారు. దీంతో యంత్రాలకు భలే డిమాండ్ పెరిగింది.

జిల్లాలోనే జహీరాబాద్ ప్రాంతంలో ఆలుగడ్డ పంట అధిక విస్తీర్ణంలో సాగువుతుంది. ఈ క్రమంలో కూలీల కొరత ఏర్పడుతోంది. అధిక ధరకు కూలీలను తీసుకురాలేక రైతులు యంత్రాలతో సాగు చేయడం మొదలు పెట్టారు. ఒక్కో యంత్రం సామర్థ్యాన్ని బట్టి రోజుకు 5 నుంచి 15 ఎకరాల వరకు విత్తనం నాటుతోంది. ట్రాక్టర్‌కు విత్తనం వేసే యంత్రాన్ని అమర్చి ఆలుగడ్డ విత్తనం వేస్తున్నారు.

పత్తి తీస్తే రెట్టింపు కూలి వస్తుందని..

ఆలుగడ్డ విత్తనం వేసుకునేందుకు కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పత్తి పంట చేతికి అందిరావడంతో కూలీలు పత్తి ఏరేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఆలుగడ్డ వేసేందుకు కూలికి వెళ్లడం కంటే పత్తి ఏరేందుకు వెళ్తే రెట్టింపు కూలి లభిస్తుండడంతో రైతులు పత్తి తీసేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఆలుగడ్డ విత్తనం వేసేందుకు వెళ్తే రోజు కూలి రూ.300 మాత్రమే లభిస్తోంది. పత్తి తీసేందుకు వెళ్తే రూ.500 నుంచి రూ.600 వరకు లభిస్తోంది. దీంతో ఆలు సాగుకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. ఇదిలా ఉంటే ఎడ్ల అరకలు కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో విత్తనం వేసేందుకు అరకలు దొరకని పరిస్థితి నెలకొంది. సాంకేతిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో సాగు సులభం అయ్యింది.

ఎరువులు సైతం యంత్రాలతోనే..

జహీరాబాద్ ప్రాంతంలో 20 వరకు యంత్రాలు ఆలుగడ్డ విత్తనం వేస్తున్నాయి. ఇంతకు ముందు యంత్రాలు అందుబాటులో లేనందున ఎడ్ల అరకల సహాయంతో విత్తనాలు వేసేవారు. ఎడ్లతో విత్తనం వేయాలన్నా, భూమిలో రసాయన ఎరువులు వేయాలన్నా కూలీల అవసరం ఉండేది. ఎడ్ల అరకలు దొరికితే కూలీలు దొరక్క పోవడం, కూలీలు దొరికితే ఎడ్ల అరకలు దొరకని పరిస్థితి ఎదురవడంతో ఆలుగడ్డ విత్తనం వేసుకునేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. యంత్రాలతో సాగు చేయడంతో ఏ మాత్రం కూలీల అవసరం ఉండదు. ఆలుగడ్డ విత్తనంతోపాటు రసాయన ఎరువులు సైతం యంత్రం ద్వారానే భూమిలోకి చేరుతుంది. కూలీల కంటే ఖర్చు కూడా తగ్గుతోందని రైతులు పేర్కొంటున్నారు. ఒక బస్తా ఆలుగడ్డ విత్తనం వేసేందుకు రూ.200 నుంచి రూ.250 వరకు చార్జి చేస్తున్నారు. యంత్రాల ద్వారా విత్తనం వేసుకోవడం ఎంతో సౌలభ్యంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

3 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం

ఈ ఏడాది సంగారెడ్డి జిల్లాలో సుమారు 3 వేల ఎకరాల్లో ఆలుగడ్డ పంట సాగయ్యే అవకాశం ఉంది. ప్రతీ సంవత్సరం ఇదే స్థాయిలో పంట సాగవుతూ వస్తోంది. రైతులు ఆలుగడ్డ పంటను సాంప్రదాయకంగా సాగుచేస్తూ వస్తున్నారు. స్వల్పకాలిక పంట కావడంతో పాటు వ్యవసాయ బావులు, బోర్లలో సమృద్ధిగా నీటి వసతి ఉండడంతో ఆలుగడ్డ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు 2 వేల ఎకరాల్లో పంట సాగైనట్లు అంచనా. అత్యధికంగా కోహీర్ మండలంలో 1,500 ఎకరాల్లో పంట సాగైనట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

18 ఎకరాలు యంత్రంతోనే..



ప్రతీసారి కూలీల సహాయంతో ఆలుగడ్డ విత్తనం వేస్తుండేవాడిని. ఈ సారి మాత్రం యంత్రాలు అందుబాటులోకి రావడంతో వాటి సహాయంతో 18 ఎకరాల్లో ఆలుగడ్డ విత్తనం వేశాను. రైతుల ఆలోచనలకు అనుగుణంగా యంత్రాలను రూపొందించారు. విత్తనంతోపాటు ఎరువులు వేసుకునే సదుపాయం ఉండడంతో సాగులో ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. యంత్రాలు రావడంతో కూలీల ఇబ్బందులు తీరాయి. యంత్రాలతో విత్తనం, బోదే వేసే విధానం సంతృప్తికరంగా ఉంది.

–వై.జయసింహారెడ్డి, రైతు, పైడిగుమ్మల్

సమయానికి కూలీలు దొరకరు



ఆలుగడ్డ విత్తనం వేసుకునేందుకు సమయానికి కూలీలు దొరకడం లేదు. ఎడ్ల అరకలు దొరకడం లేదు. దీంతో నానా అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎంతో సౌకర్యం కలిగింది. పెద్ద రైతులకు అయితే మరింత ఉపయోగకరంగా ఉంది. యంత్రం సహాయంతో నాలుగు ఎకరాల్లో ఆలుగడ్డ పంట సాగు చేశాను.

–ఎస్.అంజిరెడ్డి, రైతు, పైడిగుమ్మల్

ఆధునీకరణ వైపు ఆసక్తి..



ఆలుగడ్డ పంట విత్తనం వేసుకునేందుకు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కూలీలపై ఆధారపడకుండా యంత్రాలతో వేసుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం కూలీల కొరత ఉన్నందున యంత్రాలు రావడంతో రైతుల ఇబ్బందులు తీరాయి. ఆలుగడ్డతో పాటు ఇతర పంటలను తీసే యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. రైతులు ఆధునీకరణ వైపు ఆసక్తి చూపాలి.

– బీ.శైలజ, జిల్లా ఇన్‌చార్జి ఉద్యానాధికారి, సంగారెడ్డి

ప్రాథమిక విద్యను కాపాడాలి

- సర్వేతో విద్యార్థుల అభ్యాసనంపై తీవ్ర ప్రభావం
- తపస్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్



మాట్లాడుతున్న నవాత్ సురేశ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తుందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యదర్శి నవాత్ సురేశ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో నవాత్ సురేశ్ పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వం నెల రోజులుగా సర్వే పేరుతో పాఠశాలకు దూరం చేసిందని, దీంతో విద్యార్థుల అభ్యాసనంపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ప్రభుత్వం ఆదేశాలు లేకున్నా కొంతమంది అధికారులు డేటా ఎంట్రీ విధులు కూడా ఉపాధ్యాయులే నిర్వహించాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ గణాంక శాఖ నిర్వహించాల్సిన విధులు ఉపాధ్యాయులపై రుద్దడం సరికాదని, దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడే అవకాశం ఉందన్నారు. సెలవు రోజుల్లో కూడా ఉపాధ్యాయులు కుల గణన సర్వేలో పాల్గొని ప్రభుత్వం ఇచ్చిన విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు గౌరవ వేతనం, సీసీఎల్‌లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు మహేందర్ రెడ్డి, జిల్లా బాధ్యులు శశి కుమార్, శ్రీనివాస్,కుమార్, స్వామి గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కిష్టారెడ్డి, శ్రీకాంత్, రమేశ్, చంద్రమౌళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

- బదిలీలు, ప్రమోషన్‌లు పూర్తి చేసినందుకు ధన్యవాదాలు
- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం



మాట్లాడుతున్న సదానందం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో బదిలీలు, ప్రమోషన్‌లు వెంటనే పూర్తి చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించినందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నామన్నారు. ప్రభుత్వం డీఏలను పూర్తిగా ఇవ్వకుండా, ఒక్కటే డీఏ ఇవ్వడం శోచనీయమన్నారు. మెడికల్ బిల్లులు, సరెండర్ సెలవుల భత్యాలు సకాలంలో చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించడానికి పార్లమెంటులో చట్ట సవరణ కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతి పత్రం అందించామన్నారు. కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులను డేటా ఎంట్రీ నుంచి మినహాయించే విధంగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు ఇప్పించామని తెలియజేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దుల రవీందర్ రెడ్డి, ఖాతా యాదగిరి, కార్యదర్శి రేకులపల్లి లింగారెడ్డి, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుపాల్గొన్నారు.

అర్ధరాత్రి కూలిన ఇంటిపై కప్పు

- మట్టిలో కూరుకుపోయిన దంపతులు
- అరగంటకు పైగా నరకయాతన



అహ్మదీపూర్‌లో కూలిన ఇల్లు

గజ్వేల్: అర్ధరాత్రి పెంకుటిళ్లు పైకప్పు అనూహ్యంగా కూలిపోవడంతో దంపతులు అరగంటకు పైగా మట్టిలో కూరుకుపోయి నరకయాతన పడ్డారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చాకలి బక్కవ్వ–మహిపాల్ దంపతులు ఉపాధి బాటలో ముంబైలో ఉంటున్నారు. ఇటీవలే గ్రామానికి వచ్చి తమ పాత ఇంటిలో ఉంటున్నారు. ఈ క్రమంలోనే శనివారం నిద్రపోయిన సమయంలో అర్ధరాత్రి ఇంటికప్పు అనూహ్యంగా కూలింది. దీంతో దంపతులు ఇరువురు అరగంటకు పైగా మట్టిలో కూరుకుపోయి ఆర్తనాదాలు చేశారు. చుట్టుపక్కల వారు విని అక్కడికి చేరుకుని మట్టిలో నుంచి వారిని బయటకు తీసి రక్షించారు. ఈ ఘటనలో దంపతులకు గాయాలయ్యాయి. ఈ సమయంలో వారి పిల్లలు వేరే గదిలో నిద్రించడం వల్ల వారికి ప్రమాదం తప్పింది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాయిల్స్, ఆయిల్ దొంగతనం
- నలుగురిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తం రెడ్డి

దుబ్బాకటౌన్: ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాయిల్స్, ఆయిల్ దొంగతనం చేస్తున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు చాకచక్యంగా పట్టుకొని రిమాండ్ తరలించారు. ఆదివారం రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. హర్యానా రాష్ట్రం మేవాట్ జిల్లా బందాస్ మండల కేంద్రానికి చెందిన జుబేర్ ఖాన్, రాజస్థాన్ రాష్ట్రం భారత్ పూర్ జిల్లా జుర్హార గ్రామానికి చెందిన ఫజర్, జాహిద్, హర్యానా రాష్ట్రం ముశాయి జిల్లా పల్వాల్ మండలం టొంక గ్రామానికి చెందిన ఇర్షద్ నలుగురూ 2016లో హైదరాబాద్‌లో జేసీబీ ఆపరేటర్‌లుగా పని చేసేవారు. వీరంతా జిల్లాల్లో తిరుగుతూ కొద్దిరోజులుగా వ్యవసాయ పొలాలు, రోడ్డు పక్కన ఉండే ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాయిల్స్, ఆయిల్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇదే క్రమంలో చేగుంట మండలం మైసపేట గ్రామ శివారులో ఉన్న చైతన్య ఇండస్ట్రీస్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్‌ను దొంగతనం చేశారు. ఈ కేసులో చేగుంట పోలీసులు అక్టోబర్ 3న అరెస్టు చేసి జైలుకు పంపించగా అదే నెల 11న విడుదలై మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. నలుగురిపై జిల్లాలోని గజ్వేల్, రాయపోల్, కొమురవెల్లి, జగదేవపూర్, దౌల్తాబాద్, కుకునూరుపల్లి, ములుగు పోలీస్ స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదయ్యాయి. ఆదివారం తెల్లవారు జామున పోలీసులు రామారం గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నలుగురు కారులో వచ్చారు. అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాయిల్స్, ఆయిల్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దొంగిలించిన వాటిని పట్టణంలోని ఆదేశ్ అనే వ్యక్తికి అమ్ముతున్నట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం ఆదేశ్ పరారీలో ఉన్నాడని, నిందితుల నుంచి కారు, నాలుగు ఫోన్లు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో తొగుట సీఐ షేక్ లతీఫ్, రాయపోల్ ఎస్సై రఘుపతి, బేగంపేట ఏఎస్ఐ అమృత్, పోలీస్ సిబ్బంది మధుసూదన్ రెడ్డి, స్వామి, సత్యనారాయణ, సోమయ్య, కనకరాజు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు కరాటేలో శిక్షణ

- సెల్ఫ్ డిఫెన్స్ కోసం పాఠశాల స్థాయి నుంచే మెలకువలు
- జిల్లా వ్యాప్తంగా 6 వేల మంది బాలికలు
- మూడు నెలల పాటు నిర్వహణ
- 59 మంది కరాటే మాస్టర్లను నియామకం





కోహెడ కేజీబీవీ పాఠశాలలో శిక్షణ పొందుతున్న బాలికలు

హుస్నాబాద్: సమాజంలో రోజురోజుకూ బాలికలపై దాడులు, అత్యాచారాలు చోటు చేసుకుంటున్నాయి. ఏ సమయంలో ఏ ఆపద వస్తుందో తెలియని పరిస్థితి. ఇలాంటి సందర్భంలో వాటిని ఎదుర్కొనేందుకు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం పాఠశాల స్థాయి నుంచే ఉచితంగా కరాటేలో శిక్షణ ఇస్తున్నారు.



తలపడుతున్న విద్యార్థినులు

జిల్లాలోని 258 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా పాఠశాలలు, రెసిడెన్సియల్ పాఠశాలలను ఈ పథకం కిందట ఎంపిక చేశారు. 20వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేయబడిన ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. దాదాపు 6 వేల మంది బాలికలకు మూడు నెలల పాటు ఉచితంగా కరాటే శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

కటాస్, స్పారింగ్ భాగాల్లో..

ఆడబిడ్డల రక్షణకు కరాటే రక్షణ కవచంగా నిలుస్తుంది. ఆడ బిడ్డల రక్షణ కోసం, ఆరోగ్యవంతమైన సమాజం కోసం కరాటే ఎంతగానో తోడ్పాటును అందజేస్తుంది. చురుకైన కదలికలు, పంచ్‌లు, కిక్‌లతో శత్రువులను క్షణాల్లో మట్టి కరిపించగల శక్తి కరాటేకు ఉంటుంది. ఉక్కులాంటి దేహం, చురుకుదనంగా ప్రభావంతమైన క్రీడగా కరాటే ప్రాచుర్యం పొందింది. కరాటేలో కటాస్, స్పారింగ్ అనే రెండు భాగాలు. ఇందులో పూర్తిగా పంచ్‌లు, కిక్స్, బ్లాకింగ్స్, త్రోస్, లాక్స్, మూవింగ్, జంప్స్, బ్రేకింగ్స్, కర్ర స్టంట్స్ వంటి మూమెంట్స్ థెర్ఫీ డ్‌ను ఇవ్వనున్నారు. కరాటేలో పంచులు చేతులతో, కాళ్లతో కిక్స్ చేస్తారు.

చదువుతోపాటుగా బాలికల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు కరాటే శిక్షణ అవసరం. ఈ శిక్షణ ద్వారా శారీరక దృఢత్వంతోపాటు ఏకాగ్రత అలవడనుంది. బాలికల్లో ధైర్యాన్ని నూరిపోస్తూ ఎదుటి వారి నుంచి తమను తాము ఎలా కాపాడుకోవాలో మెళకువలు నేర్పుతున్నారు.

ప్రతి రోజూ 45 నిమిషాల పాటు..

బాలికలకు కరాటే నేర్పేందుకు శిక్షకులైన కరాటే మాస్టర్లను విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 59 మంది కరాటే మాస్టర్లను నియమించారు. ప్రతీ మాస్టర్‌కు ప్రతీ నెల రూ.5 వేల గౌరవ వేతనం ప్రభుత్వం ఇస్తుంది. పాఠశాలలో వారానికి మూడు రోజులు కరాటే క్లాస్‌లు నిర్వహించనున్నారు. మూడు నెలల్లో 36 క్లాస్‌లు చెప్పనున్నారు. ప్రతి రోజూ 45 నిమిషాల పాటు కరాటే శిక్షణ ఇవ్వనున్నారు.

బాలికలకు కరాటే అవసరం

బాలికలకు విద్యతోపాటు కరాటే ఎంతో అవసరం. ఏదైనా ఘటన జరిగినప్పుడు తనను తాను కాపాడుకోవడానికి కరాటే ఎంతో అవసరం. పాఠశాల స్థాయి నుంచే కరాటే పై నైపుణ్యం పెంపొందుతుంది. ఈ శిక్షణ ద్వారా బాలికల్లో ఆత్మస్థైర్యం, ధైర్యం పెరుగుతుంది. ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా మూడు నెలల పాటు కరాటే శిక్షణ ఉంటుంది. శిక్షకులైన కరాటే మాస్టర్లను ఎంపిక చేశాం.

– ముక్తీశ్వరి, జీసీడీఓ

కరాటేను కోర్సుగా ప్రవేశపెట్టాలి



సమాజంలో అమ్మాయిలపై జరిగే అఘాయిత్యాలను రూపు మాపేందుకు కరాటే ఉపయోగపడుతోంది. స్కూల్ స్థాయి నుంచే అమ్మాయిలకు మార్షల్ ఆర్ట్స్ అందించడం ద్వారా వారికి రక్షణ కవచంగా నిలుస్తోంది. ఎదుటి వారిని నిర్భయంగా ఎదుర్కోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో మూడు నెలలే కాకుండా కరాటే కోర్సును ప్రవేశపెడితే అమ్మాయిలకు పూర్తి స్థాయిలో న్యాయం చేసినట్లు అవుతుంది.

– కంటే రాజు, కరాటే మాస్టర్, హుస్నాబాద్

జల్సాలకు అలవాటు పడి ట్రాక్టర్ల అపహరణ

నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు



నిందితులను చూపుతున్న పోలీసులు

ములుగు(గజ్వేల్): వాహనాల దొంగతనాలకు పాల్పడిన నలుగురిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ములుగు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్వామి ట్రాక్టర్‌ను 19న గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. చుట్టు పక్కల వెతికినా లభించలేదు. 21న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి గౌరారం ఎస్ఐ నాగేశ్వర్‌తో కలిసి దర్యాప్తు చేపట్టాం. సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాక్టర్ ఉన్న చోటను గుర్తించారు. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం నాగాయిపల్లి గ్రామానికి చెందిన చెరుకుపల్లి రవీందర్‌రెడ్డి, మల్లేశం, నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అన్నెబోయిన నాగరాజు, పల్లె ప్రవీణ్ ట్రాక్టర్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది. నలుగురు మద్యానికి బానిసై జల్సాలు చేస్తూ దొంగతనాలకు పాల్పడుతుంటారని వివరించారు. అలాగే వర్గల్ మండలంలోని శాఖారంలో మరో ట్రాక్టర్‌ను దొంగిలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి ట్రాక్టర్, బైక్, కారు, రూ.45 వేల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

చిరుత పులి కలకలం

భయాందోళనలో గండ్రెడ్డిపల్లి గ్రామస్తులు



చిరుత సంచరించిన ప్రాంతం

తూప్రాన్: మండలంలోని గుండ్రెడ్డిపల్లిలో చిరుత పులి సంచారం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ సమీపంలోని ధర్వాజగండ్లు అనే ప్రాంతంలో రాతి బండలపై చిరుత ఉన్నట్లు పశువుల కాపరులు గమనించారు. సెల్‌ఫోన్లలో వీడియోలు చిత్రీకరించారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత నుంచి కాపాడాలని కోరుతున్నారు.